

మల్లన్నకు సహస్రదీపార్చన సేవ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్లకు సోమవారం సహస్రదీపార్చన సేవ నిర్వహించారు. వెండిరథంపై ఉత్సవ మూర్తులను ఆశీనులు చేసి ఆలయ ప్రదక్షిణ చేపట్టారు.



ఎండు మిర్చి రూ. 12,800

నంద్యాల(అర్బన్): పట్టణంలోని మార్కెట్ యార్డులో సోమవారం సూపర్-10 మిర్చి అమ్మకాలు జరిగాయి. జనరల్ గరిష్ట ధర క్వింటా రూ.12,800, మధ్యస్థ ధర రూ.10,700, కనిష్ట ధర రూ. 7,600గా నమోదైంది.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	: 1,633
ప్రస్తుతం	: 1,624.95
సామర్థ్యం (టీఎంసీలు)	: 105.788
ప్రస్తుతం	: 76.342
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 0
అవుట్ ఫ్లో	: 8,146

న్యూస్‌రీల్

జెడ్పీలో 8 మందికి పరిపాలనాధికారులుగా పదోన్నతి



ఏఓలుగా పదోన్నతి పొందిన వారితో జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల, సీఈఓ నాసరరెడ్డి

కర్నూలు(అర్బన్): జిల్లా పరిషత్ పరిధిలోని మండల పరిషత్, పీఆర్ఐ, పీఐయూ ఇంజినీరింగ్ కార్యాలయాల్లో సీనియర్ సహాయకులుగా విధులు నిర్వహిస్తున్న ఎనిమిది మందికి పరిపాలనాధికారులుగా పదోన్నతి లభించింది. ఈ మేరకు పదోన్నతి పొందిన వారికి సోమవారం జిల్లా పరిషత్ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి, జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి కౌన్సెలింగ్ నిర్వహించి వివిధ ప్రాంతాలకు పోస్టింగ్ ఉత్తర్వులు అందించారు. ఏఓలుగా వివిధ ప్రాంతాలకు నియమించిన వారిలో ఎన్ భాగ్యలక్ష్మిని ప్యాపిలి మండల పరిషత్‌కు, ఎం.నాగరాజస్వామిని పెద్దకడుబూరు, బీఎల్ భరణీకుమారిని కోవెలకుంట్ల, ఎంజీ నాగేంద్రకుమార్‌ను పగిద్యాల, శ్రీరాములును అవుకు, అబ్దుల్ అల్లం బాషా డోన్‌కు, రవీంద్రబాబును మండల పరిషత్ హాలహర్వికి, హేమలతను కర్నూలు డ్వామాకు పోస్టింగ్స్ ఇచ్చారు.

వైద్యసేవలు నిలుపుదల చేస్తూ నోటీసులు

కర్నూలు(హాస్పిటల్): డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ (ఆరోగ్యశ్రీ) ఓపీ, ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ (ఈహెచ్ఎస్) ఓపీ, ఐపీ సేవలు ఈ నెల 6వ తేదీ (సోమవారం) నుంచి నిలిపివేస్తున్నట్లు ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ భాస్కరరెడ్డికి సోమవారం ఏపీ ప్రైవేటు హాస్పిటల్స్, నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్ (అప్నా) నాయకులు నోటీసులు అందజేశారు. అసోసియేషన్ రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వారు పేర్కొన్నారు. నోటీసులు అందజేసిన వారిలో అప్నా కర్నూలు అధ్యక్షులు డాక్టర్ ఎస్.వేణుగోపాల్, ట్రెజరర్ డాక్టర్ రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

పెరిగిన పత్తి ధర

ఆదోని అర్బన్: ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పత్తి ధర పెరిగింది. సోమవారం 3,925 క్వింటాళ్ల పత్తి అమ్మకానికి రాగా గరిష్ట ధర రూ.7,464, మధ్య ధర రూ.7,209, కనిష్ట ధర రూ.4,531గా నమోదయ్యింది. గత రెండు నెలలుగా రూ.7,200 ధర పలుకుతూ వచ్చింది. గత వారం నుంచి రూ.50 పెరుగుతూ సోమవారం రూ.7,464గా నమోదయ్యింది.

బంగారు పతకాలు ఇచ్చేందుకు దాతలకు ఆహ్వానం

కర్నూలు సిటీ: క్లస్టర్ యూనివర్సిటీ మొదటి స్నాతకోత్సవం సందర్భంగా యూజీ, పీజీ కోర్సుల్లో అత్యుత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు బంగారు పతకాలు ఇచ్చేందుకు ఆసక్తి ఉన్న దాతలు ముందుకు రావాలని వర్సిటీ రిజిస్ట్రార్ డా.కె వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 8వ తేదీన మొదటి స్నాతకోత్సవంలో 866 మందికి డిగ్రీ పట్టాలను ప్రదానం చేయనున్నామన్నారు. వర్సిటీ కాలేజీల్లో చదివిన పూర్వ విద్యార్థులు, పారిశ్రామికవేత్తలు, ఆసక్తి ఉన్న వారు ఎవరైనా బంగారు పతకాలు ఇచ్చేందుకు ముందుకు రావాలన్నారు. ముందుకు వచ్చే దాతలు 7013159019ను సంప్రదించాలన్నారు.

నేటి నుంచి విద్యుత్ చార్జీల పెంపుపై అభిప్రాయ సేకరణ

కర్నూలు న్యూసిటీ: విద్యుత్ చార్జీల పెంపుపై వినియోగదారుల అభిప్రాయ సేకరణ చేపట్టనున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా ఎస్ఈ ఉమాపతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి డిస్కమ్‌లు ప్రతిపాదించిన వార్షిక ఆదాయం, అవసరాలు, విద్యుత్ చార్జీలపై హైబ్రీడ్ విధానంలో అభిప్రాయ సేకరణ జరుగుతుందన్నారు. 7, 8 తేదీ ల్లో విజయవాడ ఎస్ కన్వెన్షన్‌లో, 10 వ తేదీన కర్నూలు నగరంలోని ఏపీఈఆర్సీ భవనం, ఎమ్మిగనూరు, ఆదోని డివిజన్లలో ఇంజినీరింగ్ కార్యాలయాల్లో ఈ కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు మాత్రమే ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు బహిరంగ విచారణ, మధ్యాహ్నం 2 నుంచి 4.30గంటల వరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అభిప్రాయ సేకరణ ఉంటుందన్నారు.

రైతుల ఆశలకు పొగ



పొలంలో పొగాకును బేళ్లు కడుతున్న కూలీలు

భూముల కౌలు భారీగా ఉంది.. పెట్టుబడి ఖర్చు భారంగా మారింది.. పొలంలో రేయింబవళ్లు కష్టించి పొగాకు పంటను పండించినప్పటికీ రైతుకు నిర్ణయ ధర లభించడం లేదు. కంపెనీలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ.. మోసం చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదు. రైతులు తీవ్రంగా నష్టపోతున్నా పట్టించుకోకుండా.. చేష్టలుడిగి చూస్తుండటంపై విమర్శలు వస్తున్నాయి.

- పొగాకు పంటకు లభించని నిర్ణయ ధర
- ప్రారంభంలో క్వింటాకు రూ.18 వేలు ఇస్తామన్న కంపెనీలు
- దిగుబడి పెరగడంతో రూ.15,550కు కుదింపు
- కొంటున్నది మాత్రం రూ.13 వేల నుంచి రూ.14 వేల వరకే
- రైతులు నష్టపోతున్నా పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం

పెరిగిన పెట్టుబడి వ్యయం

రసాయన ఎరువుల ధరలు పెరగడంతోపాటు ట్రాక్టర్ బాడుగలు, లేబర్ చార్జీలు ఎక్కువ కావడంతో ఎకరాకు రూ.10 వేల వరకు అదనపు ఖర్చు వస్తోంది. కుటుంబ సభ్యులందరూ రేయింబవళ్లు పొలంలోనే పనులు చేస్తున్నా ఎకరాకు పెట్టుబడి వ్యయం రూ.60 వేలు అవుతోంది. గతంలో ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల వరకు రాగా.. ప్రస్తుతం 4 క్వింటాళ్ల వరకు మాత్రమే వస్తోంది. క్వింటాకు నిర్ణయించిన ధర రూ.15,550 ప్రకారం కొనుగోలు చేస్తే ఎకరాకు రూ.62,200 వస్తుంది. అయితే కంపెనీలు నిర్ణయించిన ధర ఇవ్వడం లేదు. క్వింటాకు రూ.13,000 నుంచి రూ.14,000 వరకు మాత్రమే ధర ఇస్తుండటంతో పెట్టుబడి కూడా దక్కని పరిస్థితి ఏర్పడింది.

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో పొగాకు సాగు గతేడాది కంటే పెరిగింది. ఈ ఏడాది బార్లి (సిగరెట్)వీఐఎస్ -5, వీబీహెచ్-3, రుస్టిక(బీడీ) ఏ-119, నాటు పొగాకును వేశారు. అక్కడక్కడ ప్లూ క్యూర్డ్ వర్జీనియా పొగాకు కూడా సాగైంది. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ప్రధానంగా ఇండియన్ టొబాకో కంపెనీ(ఐటీసీ), అలయన్స్-1 ఇంటర్నేషన్, వీఎస్టీ, గాడ్స్ ఫ్రే పిలిప్‌ఇండియా లిమిటెడ్ కంపెనీలు రైతులతో పొగాకు సాగు చేయించాయి. పొగాకు సాగును ప్రోత్సహించిన కంపెనీలు నేడు తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ రైతుల బతుకులతో చెలగాటమాడుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో కంపెనీలు ఇచ్చిన ధరను తీసుకోవాల్సిన పరిస్థితి రైతులకు ఏర్పడింది. చాలా మంది పెట్టుబడులు కూడా దక్కక నష్టాలు మూట కట్టుకుంటున్నారు.

సాగు ఎందుకు పెరిగిందంటే..

ఈ ఏడాది చాలా మంది రైతుల్లో ఒక్కొక్కరు 10 ఎకరాలకుపైగానే పొగాకు సాగు చేశారు. కొంత మంది 50 ఎకరాల వరకు సాగు చేశారు. కర్నూలు జిల్లాలో పత్తి తర్వాత పొగాకు పంటను ఎక్కువగా వేశారు. నంద్యాల జిల్లాలో వరి తర్వాత ఎక్కువగా సాగైన పంట పొగాకు కావడం విశేషం. 023-24లో కర్నూలు జిల్లాలో 9,586 , నంద్యాల జిల్లాలో 8,791.. మొత్తంగా 18,377 ఎకరాల్లో పొగాకు సాగు ఉండేది. గతేడాది క్వింటా పొగాకుకు రూ.20 వేల వరకు ధర రావడంతో ఈ ఏడాది రైతులు ఉమ్మడి కర్నూలు జిల్లాలో పోటీపడి సాగు చేశారు. ఈ ఏడాది కర్నూలు జిల్లాలో 36,471, నంద్యాల జిల్లాలో 30,865 .. మొత్తంగా 67,336 ఎకరాల్లో సాగు చేశారు. 2023-24తో పోలిస్తే 48,959 ఎకరాల్లో అదనంగా సాగైంది.



పొగాకు ఆకును కోసి బేళ్లు కట్టిన దృశ్యం

దళారులదే హవా..

పొగాకు సాగు చేస్తున్న భూములకు కౌలు కూడా భారీగా పెరిగింది. కొన్ని ప్రాంతాల్లో ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు కౌలు ఉండగా, మరికొన్ని ప్రాంతాల్లో రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు కౌలు ఉంది. పంట కొనుగోలులో దళారులు హవా నడిపిస్తుండటంతో రైతులకు నిర్ణయించిన ధర లభించడం లేదు. రైతుల దగ్గర తక్కువ ధరకు కొను గోలు చేసి కంపెనీలకు మాత్రం నిర్ణయించిన ధరకు దళారులు విక్రయిస్తున్నారనే విమర్శలు ఉన్నా యి. నాణ్యత బాగున్నా.. తేమ లేకపోయినప్పటికీ..ఏదో సాకు చెబుతున్నారు. తేమ ఉందని, ఆకు విరిగిందని, నాణ్యత లేదంటూ ధరను ఏకపక్షంగా తగ్గిస్తున్నారు.

ఇదీ మోసం..

పొగాకు కంపెనీలు 2023-24లో క్వింటా పొగాకుకు నిర్ణయించిన ధర రూ.15,000. ఈ ఏడాది క్వింటా పొగాకుకు రూ.18,000 ధర ఉంటుందని కంపెనీలు రైతులను నమ్మించాయి. రైతులకు అవసరమైన సీడ్ కూడా సరఫరా చేశాయి. దీంతో రైతులు ఉత్సాహంగా సాగు చేశారు. సాగు గణనీయంగా పెరిగిన నేపథ్యంలో రైతుల ఆశలను పొగాకు కంపెనీలు నీరుగార్చాయి. డిసెంబరు మొదటి వారంలో గుంటూరులో సమావేశమైన పొగాకు కంపెనీల అసోసియేషన్ ప్రతినిధులు పెరిగిన పెట్టుబడి వ్యయాన్ని ఏ మాత్రం పరిగణనలోకి తీసుకోకుండా ధరను నిర్ణయించడంపై రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది పండించిన పొగాకు ధరను కంపెనీల అసోసియేషన్ క్వింటాకు రూ.15,500 మాత్రమే నిర్ణయించింది. గత ఏడాదితో పోలిస్తే క్వింటాపై కేవలం రూ.500, కిలోపై రూ.5 మాత్రమే పెంచింది. తేమ శాతం, ఇతర నాణ్యత ప్రమాణాల పేరుతో ధరను అడ్డంగా కోసేస్తున్నాయి. తూతూ మంత్రంగా నిర్ణయించిన రూ.15,550 ధర ఇస్తున్నట్లు తెలుస్తోంది. పొగాకు బేళ్లలో ఐదు శాతానికి నిర్ణయించిన ధర ఇచ్చి 95 శాతానికి రూ.13,000 నుంచి రూ.14,000 వరకు ధరతో కొనుగోలు చేస్తున్నారు.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో గతేడాది, ప్రస్తుతం పొగాకు సాగు వివరాలు.. (ఎకరాల్లో)

జిల్లా	2023-24	2024-25
కర్నూలు	9586	36,471
నంద్యాల	8791	30,865
మొత్తం	18,377	67,336

గిట్టుబాటు ధర లేదు



నీటిసదుపాయం కింద ఈసారి 55 ఎకరాల్లో బార్లీ పొగాకు సాగు చేశాం. సొంత భూమి అయితే ఎకరాకు రూ.70 వేల నుంచి 80 వేల వరకు పెట్టుబడి వస్తోంది. కౌలుకు తీసుకుంటే పెట్టుబడి వ్యయం రూ. లక్ష ఉంటుంది. ఇంత భారీగా పెట్టుబడి పెట్టినా గిట్టుబాటు ధర లేక ఈ సారి నష్టాలు తప్పడం లేదు. – సీతారామిరెడ్డి, గార్గేయపురం, కర్నూలు మండలం

దిగుబడి తగ్గింది



మాకు 12 ఎకరాలు సొంత భూమి ఉండగా 6 ఎకరాలు కౌలుకు తీసుకున్నాం. వాతావరణ పరిస్థితులు సరిగ్గా లేక ఈ సారి దిగుబడి పడిపోయింది. సగటున ఎకరాకు 4 క్వింటాళ్ల వరకే వస్తోంది. మేము ఇప్పటి వరకు 26 క్వింటాళ్లు అమ్మగా.. రెండు బేళ్లకు మాత్రమే రూ.15,550 ధర వచ్చింది. కనీసం రూ.18,000 ధర ఉంటే గిట్టుబాటు అవుతుంది. – వెంకటేశ్వర్లు, పర్ల, కల్లూరు మండలం

ఆదోని ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్ సస్పెన్షన్

- మరో ఇద్దరి ఉద్యోగులపై వేటు

కర్నూలు(సెంట్రల్): ఇటీవల ఆదోనిలో సంచలనం సృష్టించిన నకిలీ మరణ సర్టిఫికెట్‌తో రూ. కోట్ల విలువైన స్థలాన్ని అక్రమ రిజిస్ట్రేషన్ చేసిన ఘటనపై రిజిస్ట్రేషన్ శాఖ కొరడా ఝులిపించింది. బాధ్యులైన ముగ్గురు అధికారులను సస్పెండ్ చేసింది. ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌గా ఉన్న హాజీమియ్యా, సీనియర్ అసిస్టెంట్ ఈరన్న, జూనియర్ అసిస్టెంట్ రమేష్‌ను సస్పెండ్ చేస్తూ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. బతికున్న ఎగ్గొట్టి ఈశ్వరయ్య పేరుతో నకిలీ మరణ ధ్రువీకరణ సర్టిఫికెట్, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లతో ఆముదాల భాస్కర్ అనే వ్యక్తి రూ. 35 కోట్ల విలువ చేసే 6.51 ఎకరాల భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న విషయం విదితమే. బాధితుల ఫిర్యాదుతో విషయం వెలుగులోకి వచ్చింది. ఈ మేరకు జిల్లా ఇన్‌చార్జ్ చెన్నకేశవరెడ్డి ఆదివారం ఆదోనికి వెళ్లి విచారణ చేశారు. రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు తప్పిదం ఉండడంతో ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్‌తో పాటు ఇద్దరు ఉద్యోగులపై వేటు వేశారు. హాజీమియా సస్పెండ్ కావడంతో ఆయన స్థానంలో ఆస్పరి సబ్ రిజిస్ట్రార్ పి. అరుణ్ కుమార్‌ను నియమించారు.

సీఐలకు స్థానచలనం




కర్నూలు: కర్నూలు నాల్గవ జోన్‌లో పనిచేస్తున్న 9 మంది సీఐలకు స్థానచలనం కలిగింది. ఈ మేరకు కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. రేంజ్ పరిధిలో వీఆర్‌లో ఉన్న ముగ్గురికి పోస్టింగులు దక్కగా కర్నూలు ఎస్‌బీ-1లో పనిచేస్తున్న జి.ప్రసాద్‌ను వీఆర్‌కు పంపుతూ డీఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలన సౌలభ్యంలో భాగంగా ఈ బదిలీలు చేపట్టినట్లు ఆయన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఉత్తర్వులు అందిన వెంటనే వారికి కేటాయించిన స్థానాల్లో చేరాల్సిందిగా అందులో పేర్కొన్నారు.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
ఇ.కంబగిరి రాముడు	ఆళ్లగడ్డ రూరల్	నంద్యాల త్రీటౌన్
ఎస్.సూర్య మౌళి	నంద్యాల త్రీటౌన్	ఎస్‌బీ-2, నంద్యాల
ఎస్.అష్రాఫ్ బాషా	ఎస్‌బీ-2, నంద్యాల	సీసీఎస్-2, కర్నూలు
డి.మురళీధర్ రెడ్డి	సీసీఎస్-2,కర్నూలు	ఆళ్లగడ్డ రూరల్
ఎస్.తేజామూర్తి	వీఆర్, కర్నూలు	ఎస్‌బీ-1, కర్నూలు
జి.ప్రసాద్	ఎస్‌బీ-1, కర్నూలు	వీఆర్, కర్నూలు
డి.భాస్కర్‌రెడ్డి	డీసీఆర్‌బీ, కడప	డీఎస్‌బీ-2, కడప
యు.వెంకట కుమార్	వీఆర్, కడప	డీసీఆర్‌బీ, కడప
ఇ.వేణుగోపాల్	వీఆర్, కడప	ఎస్సీ, ఎస్టీ సెల్, కడప

11 నుంచి మకర సంక్రాంతి బ్రహ్మోత్సవాలు

శ్రీశైలంటెంపుల్: మకర సంక్రమణ పుణ్యకాలాన్ని పురస్కరించుకుని ఈ నెల 11 నుంచి సంక్రాంతి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. పంచాహ్నికదీక్షతో ఏడు రోజుల పాటు ఈ ఉత్సవాలు జరుగనున్నాయి. ఈ నెల 11న ఉదయం 8.45 గంటలకు స్వామివారి యాగశాల ప్రవేశం, ముక్కోటి దేవతలను, సకల సృష్టిని బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించేందుకు ధ్వజారోహణ కార్యక్రమం చేపడతారు. ఈ నెల 12నుంచి స్వామిఅమ్మవార్లకు వాహనసేవలు, 14న మకరసంక్రాంతిని పురస్కరించుకుని బ్రహ్మోత్సవ కల్యాణం, 16న యాగపూర్ణాహుతి, 17న పుష్పోత్సవం, శయనోత్సవం, ఏకాంతసేవ నిర్వహిస్తారు.



ఆర్జితసేవలు నిలుపుదల

ఉత్సవాల సందర్భంగా ఈ నెల 11నుంచి 17వరకు ఆర్జిత, ప్రత్యక్ష పరోక్షసేవలైన రుద్రహోమం, చండీహోమం, మృత్యుంజయహోమం, గణపతిహోమం, శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం, స్వామిఅమ్మవార్ల కల్యాణం, ఏకాంతసేవలు నిలుపుదల చేశారు.

గడువులోగా వినతులు పరిష్కరించండి

కర్నూలు(సెంట్రల్): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన సమస్యలను నిర్దేశిత సమయంలోపు పరిష్కరించాలని కలెక్టర్ రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా కలెక్టర్ రంజిత్‌బాషా, జేసీ డాక్టర్ బి.నవ్య, డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ప్రజలు ఇచ్చిన అర్జీలపై సరైన ఎండార్స్‌మెంట్ ఇచ్చి పరిష్కారాలు చూపాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కల్యాణి,ఎస్‌డీసీ చిరంజీవి, బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ బీకే వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

- రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన సమస్యలను పరిష్కరించకుండా ఏమి చేస్తున్నారని కలెక్టర్ పి.రంజితబాషా తహసీల్దార్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెవెన్యూ సదస్సులు పూర్తి కావాస్తున్నా ఒక్క సమస్యకు పరిష్కారం చూపడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఓర్వకల్లులో 165, మద్దికెర 81, ఎమ్మిగనూరు 130, పత్తికొండ 80, కౌతాళం 98, ఆలూరు 111, ఆదోని 37, కర్నూలు 125, గోనెగొండ్ల మండలాల్లో 57 అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.



ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

20 నుంచి ఇంటింటా కుష్టు వ్యాధిపై సర్వే చేయండి

జిల్లాలో ఈనెల 20 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు ఇంటింటా కుష్టు వ్యాధిపై సర్వే నిర్వహించాలని కలెక్టర్ రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో కుష్టు వ్యాధి నివారణపై రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2027 సంవత్సరంనాటికీ కుష్టువ్యాధిని నిర్మూలించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. అందులో భాగంగా ఇంటింటా సర్వే చేసి కుష్టువ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఎవరికైనా కుష్టు వ్యాధి లక్షణాలు ఉంటే వైద్యాధికారులకు వివరాలను అందించాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా కుష్టు, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ ఎల్.భాస్కర్, వైద్యులు మల్లికార్జునరెడ్డి, విజయ్ ప్రకాష్, వై.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

తుది ఓటరు జాబితా విడుదల

- ఏడాదిలో 47,775 మంది ఓటర్ల పెరుగుదల

కర్నూలు(సెంట్రల్): స్పెషల్ సమ్మరీ రివిజన్-2025కు సంబంధించి సోమవారం తుది ఓటరు జాబితాను విడుదల చేశారు. ఈజాబితా ప్రకారం జిల్లాలో 20,62,569 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుష ఓటర్లు 10,17074, మహిళా ఓటర్లు 10,45,183 మంది, థర్డ్ జెండర్ ఓటర్లు 312 మంది ఉన్నారు. పురుష ఓటర్లతో పోల్చుకుంటే మహిళా ఓటర్లు 28,109 మంది అధికంగా ఉన్నారు. కాగా, 2024 జనవరి 22వ తేదీన ప్రకటించిన ఎస్ఎస్ఆర్-2024 ప్రకారం జిల్లాలో 20,14,794 మంది ఓటర్లు ఉండగా, ప్రస్తుత సంవత్సరం ప్రకటించిన తుది ఓటరు జాబితా ప్రకారం 20,62,569 ఉండడంతో ఏడాది కాలంలో 47,775 మంది ఓటర్లు పెరిగారు. ఇటీవల ఎస్ఎస్ఆర్-2025కు సంబంధించి ప్రకటించిన ముసాయిదా జాబితా ప్రకారం 20,59,700 మంది ఓటర్లు ఉండగా, తుది జాబితాలో 20,62,569 మంది ఓటర్లు ఉన్నారు. దీంతో 2,869 మంది ఓటర్లు పెరిగారు. మరోవైపు జిల్లాలో సర్వీసు ఓటర్లు 1615, పీడబ్ల్యూడీ ఓటర్లు 23,908 మంది, 80 ఏళ్లకు పైబడిన వారు 27,208 మంది, ఎన్ఆర్ఐ ఓటర్ల సంఖ్య 123గా ఉంది. కాగా, ఎస్ఎస్ఆర్-2025 ప్రకారం 18-19 ఏళ్ల మధ్య ఓటర్ల సంఖ్య 27,927గా ఉంది. 992 మంది ఓటర్లు చనిపోగా, 1,889 మంది ఇతర ప్రాంతాలకు వలస వెళ్లగా, 781 డూప్లికేట్ ఓటర్లను గుర్తించారు.

చేనేత ఉత్పత్తులను ప్రోత్సహించండి

చేనేత ఉత్పత్తుల కొనుగోళ్లను ప్రోత్సహించాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద ఎమ్మిగనూరు చేనేత కోఆపరేటివ్ సొసైటీ సంచార వాహనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం చేనేత ఉత్పత్తులను పరిశీలించారు. వివిధ రకాల వస్త్రాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అధికారులు, ప్రజలు చేనేత వస్త్రాలను కొనుగోలు చేయాలన్నారు. ఈ వాహనం ద్వారా చేనేత వస్త్రాలను జిల్లాలోని అన్ని ప్రాంతాల ప్రజలకు అందుబాటులోకి తీసుకెళ్లాలని సూచించారు. చేనేత జౌళి శాఖసహాయ సంచాలకులు నాగరాజారావు మాట్లాడుతూ.. సంచార వాహనంలో మూడు గంటల్లోనే భారీగా ఉత్పత్తులను విక్రయించినట్లు చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కల్యాణి, డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ పాల్గొన్నారు.



చేనేత సంచార వాహనంలో వస్త్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కాల్వలోకి దూసుకెళ్లిన కారు

- మద్యం మత్తులో డ్రైవింగ్
- విద్యార్థినులకు తప్పిన పెను ప్రమాదం

బనగానపల్లె: ఆరుగురు విద్యార్థినులు మృత్యు కోరల్లో నుంచి త్రుటిలో బయటపడ్డారు. సోమవారం సాయంత్రం బనగానపల్లెలో ఎస్సార్‌బీసీ కాల్వలోకి కారు దూసుకెళ్లగా అందులో ఉన్న విద్యార్థినులతో పాటు డ్రైవర్‌ను స్థానికులు, పోలీసులు కాపాడారు. సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని తెలుగుపేటకు చెందిన జక్కు సురేష్ కూతురు సాయి చంద్రిక స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతోంది. మద్యం తాగి ఉన్న సురేష్ సాయంత్రం కుమార్తెను పిల్చుకొచ్చేందుకు టాటా సుమో తీసుకొని స్కూల్‌కు వెళ్లాడు. సాయిచంద్రికతో పాటు అదే కాలనీకి చెందిన మరో ఐదుగురు విద్యార్థినులను వాహనంలో ఎక్కించుకున్నాడు. ఇంటికి ఎస్సార్‌బీసీ కాల్వ కట్ట మీద బయలుదేరాడు. మద్యం మత్తులో వాహనాన్ని వేగంగా నడపడంతో అదుపు తప్పి కాల్వలోకి దూసుకెళ్లింది. అప్పటికి కాల్వలో సుమారు నాలుగున్నర అడుగుల మేర నీరు ఉంది. సుమోకు గల ఓ డోర్ గ్లాస్ ఓపెన్‌లో ఉండటంతో అందులో నుంచి విద్యార్థినులు వాహనంపై భాగానికి చేరుకొని గట్టిగా కేకలు వేశారు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ ప్రవీణ్‌కుమార్ అక్కడికి చేరుకొని విద్యార్థినులను తాడు సహాయంతో బయటకు తెచ్చారు. సురేష్ మద్యం మత్తులో ఉండటంతో ప్రమాదం జరిగిందని అతనిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.



విద్యార్థినులను రక్షిస్తున్న పోలీసులు, స్థానికులు

పోలీసు ప్రధాన పరీక్షకు 241 మంది అభ్యర్థుల ఎంపిక

- 15వ తేదీ వరకు దేహదారుఢ్య పరీక్షలకు విరామం
- 16న పునఃప్రారంభం

కర్నూలు: కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్షకు 246 మంది పురుష అభ్యర్థులు ఎంపికయ్యారు. పోలీసు నియామక ప్రక్రియలో భాగంగా ఉమ్మడి కర్నూలు జిల్లాకు సంబంధించి కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు కర్నూలు ఏపీఎస్పీ రెండవ పటాలంలో దేహదారుఢ్య పరీక్షలు కొనసాగుతున్నాయి. 6వ రోజు సోమవారం 600 మంది అభ్యర్థులను ఆహ్వానించగా 332 మంది అభ్యర్థులు బయోమెట్రిక్‌కు హాజరయ్యారు. వారి ధ్రువపత్రాల పరిశీలన తర్వాత ఫిజికల్ మెజర్‌మెంట్స్ టెస్టులు నిర్వహించారు. అనంతరం ఫిజికల్ ఎఫిషీయన్సీ టెస్టులో భాగంగా ముందుగా 1600 మీటర్ల పరుగు నిర్వహించి అందులో అర్హత సాధించిన వారికి 100 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్ పరీక్షలు నిర్వహించారు. వాటిలో ప్రతిభ కనపరచి కానిస్టేబుల్ ప్రధాన పరీక్షకు 241 మంది అర్హత సాధించారు. ఏవైనా సమస్యలు, ఇతర కారణాలతో అప్పీల్ చేసుకున్న అభ్యర్థులు జనవరి 28వ తేదీన హాజరు కావాలని అధికారులు తెలిపారు. ఈనెల 15వ తేదీ వరకు సంక్రాంతి పండుగ సెలవులు ఉన్నందున దేహదారుఢ్య పరీక్షలకు విరామం ప్రకటించారు. ఈనెల 8వ తేదీన ప్రధానమంత్రి నరేంద్రమోదీవిశాఖపట్నం పర్యటనకు వస్తున్నందున జిల్లా నుంచి సిబ్బంది బందోబస్తు విధులకు వెళ్లారు. అలాగే తిరుపతిలో 10వ తేదీన వైకుంఠ ఏకాదశి సందర్భంగా బందోబస్తు కోసం కూడా జిల్లా నుంచి సిబ్బంది వెళ్లారు. దీంతో దేహదారుఢ్య పరీక్షల వద్ద బందోబస్తు విధులకు సిబ్బంది కొరత ఏర్పడింది. తిరిగి 16వ తేదీ నుంచి దేహదారుఢ్య పరీక్షలు పునఃప్రారంభం కానున్నాయి. హోంగార్డ్స్ సదరన్ రీజియన్ కమాండెంట్ మహేష్ కుమార్, అడ్మిన్ అడిషనల్ ఎస్పీ హుసేన్ పీరా, ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, డీపీఓ కార్యాలయం, సాంకేతిక సిబ్బంది ఈ పరీక్షలకు పర్యవేక్షించారు.



పరుగుపందెంలో పోటీ పడుతున్న అభ్యర్థులు

పల్లె పండుగ బిల్లులకు 'గ్రహణం'

- ఇప్పటి వరకు రూ.20 కోట్ల వరకు పెండింగ్
- నాణ్యత గురించి పట్టించుకునే వారే కరువు

కర్నూలు(అర్బన్): పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా గత ఏడాది నవంబర్ నెలలో ప్రారంభించిన పనులకు సంబంధించిన బిల్లుల విడుదలకు గ్రహణం పట్టుకుంది. గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణాల పనులన్నింటిని సంక్రాంతి పండుగ నాటికి పూర్తి చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. కాగా పనులు వేగంగా చేయాలని అధికారులు సమీక్షలు, సమావేశాలు నిర్వహిస్తున్నారే కాని బిల్లుల విడుదల గురించి పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. నిన్న మొన్నటి వరకు గత ప్రభుత్వంలో చేసిన పనులకు బిల్లులు చెల్లించలేదని అబద్ధపు ఆరోపణలు చేసిన కూటమి నేతలు ప్రస్తుతం తమ ప్రభుత్వంలో బిల్లుల విడుదలలో నెలకొన్న జాప్యంపై నోరు మెదపని స్థితిలో పడిపోయారు. చేసిన పనులకు చేసినట్లుగా ఎం బుక్ రికార్డు చేసి బిల్లులను అప్‌లోడ్ చేసిన రెండు, మూడు రోజుల్లోనే బిల్లులు పడిపోతాయని చెప్పిన దానికి నేడు జరుగుతున్న విధానానికి పొంతన కుదరడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

రూ.70.18 కోట్లతో చేపట్టిన 870 పనులు ...

పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.70.18 కోట్లతో 870 పనులు చేపట్టారు. ఈ పనుల్లో ఇప్పటి


కృష్ణగిరి మండలం బొంతిరాళ్ల గ్రామంలో వేస్తున్న సీసీ రోడ్డు

వరకు 742 పనులు పూర్తి చేసినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఈ పనులను సంక్రాతి పండుగ నాటికి పూర్తి చేయాలని నిర్ణీత గడువును కూడా విధించిన నేపథ్యంలో పల్లెల్లో కూటమి పార్టీలకు చెందిన నేతలు హడావిడిగా పనులు చేస్తునానరు. ఈ నేపథ్యంలోనే పలు ప్రాంతాల్లో చేసిన పనులకు సంబంధించిన క్వాలిటీపై కూడా దృష్టి సారించనట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. వేగంగా సీసీ రోడ్లు వేయడం, క్యూరింగ్ కూడా సరిగా చేయనట్లు తెలుస్తోంది. రోడ్ల నాణ్యత పట్ల పీఆర్ క్వాలిటీ కంట్రోల్ విభాగం ఇంజినీర్లు కూడా అధిక రోడ్ల పనులు జరుగుతున్న నేపథ్యంలో సమయం తక్కువగా ఉండడం వల్ల యా పనుల పట్ల పూర్తి స్థాయిలో దృష్టి సారించనట్లు తెలుస్తోంది. కర్నూలు, ఆదోని డివిజన్లకు సంబంధించి ఇద్దరు డీఈఈలు, నలుగురైదుగురు ఏఈలు ఉన్న కారణంగా కూడా అన్ని పనులపై వీరు దృష్టిని కేంద్రీకరించలేక పోతున్నట్లు కూడా తెలుస్తోంది. అయితే పూర్తి అయిన పనులకు వంద శాతం బిల్లుల చెల్లింపు జరగదని, మొత్తం బిల్లులో 15 శాతాన్ని డిపాజిట్‌గా ఉంచుకొని, క్వాలిటీ చెక్ చేసిన అనంతరం డిపాజిట్‌గా ఉంచుకున్న మొత్తాన్ని విడుదల చేయడం జరుగుతుందని ఇంజనీరింగ్ వర్గాలు చెబుతున్నాయి.

ఏ పనులకు ఎంత పెండింగ్ అంటే...

బిల్డింగ్‌లకు..	రూ. 44,56,620
ప్లాంటేషన్‌కు..	రూ. 14,26,501
సీసీ రోడ్లకు..	రూ. 14,61,83,455
మినీ గోకులాలకు..	రూ. 42,78,291
ఇతర పనులకు..	రూ. 22,31,198

రూ.20 కోట్ల వరకు బకాయిలు ...

ఆయా గ్రామాల్లో చేపట్టిన సీసీ రోడ్ల పనులకు సంబంధించి ఇప్పటి వరకు రూ.20 కోట్ల వరకు బకాయిలు ఉన్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. ఈ నెల 2వ తేది వరకు వివిధ పనులకు సంబంధించి అధికారులు చెబుతున్న విధంగా రూ.15.85 కోట్లు ఉండగా, ఈ ఐదారు రోజుల్లో ఈ పెండింగ్ రూ.20 కోట్లకు చేరినట్లు వారు అంగీకరిస్తున్నారు.

త్వరలోనే బిల్లులు విడుదలవుతాయి



జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన సీసీ రోడ్లు, ఇతరత్రా పనులకు త్వరలోనే బిల్లులు విడుదల కానున్నాయి. ఇప్పటి వరకు చేసిన పనులకు సంబంధించి రూ.14.50 కోట్ల వరకు బిల్లులను అప్‌లోడ్ చేశాం.మిగిలిన రూ.5 కోట్ల పనులకు బిల్లులను అప్‌లోడ్ చేయాల్సి ఉంది. వాటిని కూడా వెంటనే అప్‌లోడ్ చేయాలని క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహిస్తున్న ఇంజనీర్లకు ఆదేశాలు జారీ చేశాం. చేస్తున్న పనుల్లో ఎక్కడా క్వాలిటీకి రాజీ పడడం లేదు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పనులు జరుగుతున్న ప్రాంతాల్లో ఉంటు పర్యవేక్షిస్తున్నారు. అలాగే ఏఈ, డీఈఈ, ఈఈలు కూడా పనులను పర్యవేక్షిస్తున్నారు.

– వీ రామచంద్రారెడ్డి, పీఆర్ ఎస్ఈ

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


మృతి చెందిన దస్తగిరయ్య

తుగ్గలి: చెర్వుతండా సమీపంలో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందారు. చెన్నంపల్లికి చెందిన దస్తగిరయ్య(32) ఇంటి సరుకులు తెచ్చుకునేందుకు బైక్‌పై సోమవారం గుత్తికి వెళ్లాడు. తిరుగు ప్రయాణంలో సాయంత్రం 6.30 గంటల సమయంలో మార్గమధ్యలో విద్యుత్ స్తంభాల ఫ్యాక్టరీ దాటిన తర్వాత రోడ్డుపై పడిన గుంతను తప్పించబోయి అదుపుతప్పి కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో దస్తగిరయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య షరీఫా, కుమారుడు, కూతురు ఉన్నారు.

మూడు రోజుల్లో ముగ్గురు..

చెన్నంపల్లి గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు మూడు రోజుల వ్యవధిలో దుర్మరణం చెందడంతో గ్రామంలో విషాదం అలుముకుంది. ఈనెల 3వ తేదీన గ్రామానికి చెందిన వలుకూరి రాజశేఖర్‌చౌదరి, సుమలత దంపతులు అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలం కిష్టిపాడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. ఆ ఘటన మరవకముందే మరొకరు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో గ్రామంలో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. మరో పదిహేను రోజుల్లో దేవర ఉత్సవాలు నిర్వహిస్తున్న తరుణంలో వరుస ప్రమాదాలు గ్రామస్తులను తీవ్ర ఆవేదనకు గురిచేస్తున్నాయి.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

- కుడి చేతిపై అమ్మ, ప్రేమ గుర్తు
- ఎడమ చేతిపైన వెంకీ అనే అక్షరాలు

కర్నూలు: కర్నూలు రైల్వేస్టేషన్ శివారు దూపాడుకు వెళ్లే మార్గంలో 245/1 ఎలక్ట్రికల్ పోల్ వద్ద రైలు ఢీకొన్న ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. సుమారు 45 సంవత్సరాలు వయస్సు గల మృతదేహం రైల్వే ట్రాక్‌పై పడివున్నట్లు స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు రైల్వే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిసరాలను పరిశీలించారు. కర్నూలు రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ లక్ష్మన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు రైల్వే పీఎస్ హెడ్ కానిస్టేబుల్ మాధవస్వామి కేసు నమోదు చేశారు. మృతుడు నీలం రంగు ఫుల్ హ్యాండ్స్ షర్టు, నలుపు రంగు ప్యాంటు ధరించాడు. కుడిచేయి మణికట్టుకు ఎరుపు, పసుపు రంగు దారాలు ఉన్నాయి. కుడి చేతిపై అమ్మ అనే అక్షరం ఉండి, ప్రేమ గుర్తు ఉంది. ఎడమ చేతిపైన వెంకీ అనే అక్షరాలు ఉండి ప్రేమ గుర్తు సింబల్ ఉంది. 5.3 అడుగుల ఎత్తు, ఛామన ఛాయ రంగు ఉంటాడు. ఆచూకీ తెలిసినవారు 9441802327, 9030481295కు ఫోన్ చేసి సమాచారం అందించాలని ఎస్ఐ బిందు మాధవి కోరారు.

నిందితుడి పరారీ..?

ఆదోని అర్బన్: ఆదోని పట్టణంలోని ఓ పోలీస్ స్టేషన్ పరిధిలో నిందితుడిని కోర్టుకు తీసుకెళ్తుండగా పరారైనట్లు సమాచారం. ఆదివారం ఓ దొంగతనం కేసులో పట్టుబడిన నిందితుడిని సోమవారం కోర్టుకు తీసుకెళ్తుండగా పోలీసుల కళ్లుగప్పి నిందితుడు పరారైనట్లు తెలిసింది. ఈ విషయంపై సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారి వివరణ కోరగా.. తామే స్టేషన్ బెయిల్ ఇచ్చామని చెబుతుండటం కొసమెరుపు.

పింఛన్.. టెన్షన్

- హెల్త్, దివ్యాంగుల పింఛన్ల విచారణ ప్రారంభం
- ఆందోళనలో లబ్ధిదారులు

కర్నూలు(అగ్రికల్చర్): వీల్ చైర్, బెడ్‌కు పరిమితమై రూ.15,000 తీసుకుంటున్న హెల్త్, దివ్యాంగుల పింఛన్లపై వెరిఫికేషన్/ రీ అనాలసిస్‌కు మెడికల్ టీమ్‌లు సోమవారం శ్రీకారం చుట్టాయి. మూడు బృందాలు వెరిఫికేషన్ కార్యక్రమంలో పాల్గొన్నాయి. షెడ్యూలు ప్రకారం మొదటి రోజు ప్రక్రియ రాత్రి 9 గంటల వరకు కొనసాగింది. ఆదోని రూరల్ మండలంలో 11, అర్బన్‌లో 1, పెద్దకడుబూరులో 8, గోనెగండ్లలో 18, హొళగొందలో 18 ప్రకారం 56 పింఛన్ల పరిశీలించారు. వీల్ చైర్‌పై ఉన్నారా... బెడ్‌పై ఉన్నారా.. నడవగలుగుతున్నారా.. అనే దానిని నిశితంగా పరిశీలించారు. అనంతపురం జిల్లాకు చెందిన డాక్టర్లను రీ అనాలసిస్‌కు వినియోగిస్తుండటం గమనార్హం.


ఆదోనిలో పింఛన్‌దారును పరిశీలిస్తున్న డాక్టర్ల బృందం

సదరం ధ్రువపత్రాలను కూడా పరిశీలించారు. షెడ్యూలు ప్రకారం ఏ రోజువి అదే రోజు విధిగా చేయాల్సి ఉంది. రీ అనాలసిస్ జరుగని పింఛన్‌దారులను హోల్డ్‌లో పెడతారు. వెరిఫికేషన్ అయిన తర్వాతనే పింఛన్ ఇస్తారని అధికారులు తెలిపారు. పింఛన్ల రీ వెరిఫికేషన్‌కు ప్రభుత్వం శ్రీకారం చుట్టడం గ్రామాల్లో తీవ్ర చర్చనీయాంశం అయింది. పింఛన్ ఉంటుందో.. ఉండదోనన్న చర్చ మొదలైంది. నమ్మి చంద్రబాబును గెలిపిస్తే అసలుకే మోసం వచ్చిందనే భావనలో లబ్ధిదారులు ఉన్నారు. మంగళవారం మంత్రాలయం, ఎమ్మిగనూరు, గూడూరు పరిధిలో విచారణ చేయనున్నారు.

కుక్కను తప్పించబోయి..

అదుపు తప్పిన కారు ● వ్యక్తి దుర్మరణం

కోడుమూరు రూరల్: కర్నూలు – కోడుమూరు రహదారిలో కొత్తూరు సమీపంలో సోమవారం సాయంత్రం కారు బోల్తా పడిన ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గోనెగండ్ల మండలం పెద్దనేలటూరు గ్రామానికి చెందిన పెద్దయ్య అనే వ్యక్తి సోమవారం గుండెపోటుతో కర్నూలు ఆస్పత్రిలో చనిపోయాడు. పెద్దయ్య మృతదేహాన్ని సాయంత్రం ఒక వాహనంలో స్వగ్రామానికి తరలిస్తుండగా, వెనుక మరో కారులో పెద్దయ్య కుమారుడు గిడ్డయ్య డ్రైవింగ్ చేస్తూ కుటుంబ సభ్యులైన కోడుమూరుకు చెందిన సప్పాగు విజయ్ (55), సంతోషమ్మ, పుష్పావతి, కురుపాలును ఎక్కించుకుని బయలుదేరారు. ఈ నేపథ్యంలో కొత్తూరు గ్రామ సమీపంలో కారుకు కుక్క అడ్డు రావడంతో తప్పించబోయి అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో సప్పాగు విజయ్ అక్కడికక్కడే మృతి చెందగా, గిడ్డయ్యకు తీవ్రగాయాలయ్యాయి. వెనుక కూర్చున్న ముగ్గురు మహిళలకు స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న కోడుమూరు సీఐ తబ్రేజ్, ఎస్ఐ శ్రీనివాసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను స్థానిక పెంచికల పాడు విశ్వభారతి హాస్పిటల్‌కు తరలించారు. విజయ్ మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య సంతోషమ్మతో పాటు, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ ప్రమాదం జరిగిన స్థలంలోనే రెండు రోజుల క్రితం బైక్, కారు ఢీకొన్న ప్రమాదంలో కోడుమూరుకు చెందిన దంపతులు దుర్మరణం చెందారు.


ప్రమాదంలో దెబ్బతిన్న కారు

తుమ్మలూరులో విషాదం

- బావిలో మహిళ మృతదేహాన్ని వెలికితీసేందుకు వెళ్లి ఊపిరాడక మరొకరు మృతి
- ఇరువురిది ఒకే గ్రామం

జూపాడుబంగ్లా/పాములపాడు: బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న మహిళ మృతదేహాన్ని వెలికితీసేందుకు వెళ్లి మరో వ్యక్తి కూడా ప్రాణాలు కోల్పోయాడు. మృతులిద్దరిది ఒకే గ్రామం. దీంతో పాములపాడు మండలం తుమ్మలూరు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. వివరాల్లోకి వెళితే.. తుమ్మలూరు గ్రామానికి చెందిన తెలుగు లక్ష్మమ్మ (53) అనే మహిళ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతోంది. ఈ క్రమంలో ఆమె తీవ్ర మనస్తాపానికి లోనై ఆదివారం మధ్యాహ్నం 80 బన్నూరు రెవెన్యూ పరిధిలోని చుక్కాపుల్లారెడ్డి బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆమె మృతదేహం కోసం బావిలో గాలించసాగారు. ఇందులో తెలుగు లక్ష్మీనారాయణ(44) అనే వ్యక్తి నీటిలో గాలించే సమయంలో ఊపిరి ఆడక ప్రాణాలు కోల్పోయాడు. ఇద్దరు బావిలోనే మృతిచెందటంతో వారి మృతదేహాల కోసం సోమవారం గ్రామస్తులు ఇనుప కొక్కేలు వేసి గాలించారు. ఉదయం 10.30 గంటల ప్రాంతంలో లక్ష్మీనారాయణ మృతదేహం లభించగా, సాయంత్రం 4గంటల ప్రాంతంలో లక్ష్మమ్మ మృతదేహాన్ని గుర్తించి బయటకు తీశారు. కాగా లక్ష్మీనారాయణకు భార్య లక్ష్మి, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. తెలుగు లక్ష్మమ్మకు భర్త మోహన్‌రావు, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. సంఘటన జరిగిన ప్రాంతం జూపాడుబంగ్లా పోలీసుస్టేషన్ పరిధిలోకి వస్తుంది. దీంతో మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ లక్ష్మీనారాయణ కేసు నమోదు చేసుకొని మృతదేహాలకు నందికొట్కూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహింపజేసి బంధువులకు అప్పగించారు.


బావి వద్ద మృతదేహాల కోసం గ్రామస్తుల గాలింపు



మృతులు లక్ష్మీనారాయణ (ఫైల్),లక్ష్మమ్మ (ఫైల్)

ప్రయాణికులకు విజ్ఞప్తి

- ప్యాసింజర్ల రైళ్ల నంబర్ల మార్పు



మద్దికెర: గుంతకల్లు, డోన్ మీదుగా వెళ్లే పలు ప్యాసింజర్ల రైళ్ల నంబర్లు మారాయి. గుంతకల్లు నుంచి బయలుదేరే కాచిగూడ, డోన్, కర్నూలు టౌన్ వరకు నడుస్తున్న ప్యాసింజర్ల రైళ్ల నంబర్లను రైల్వే శాఖ మార్చింది. కొత్త నెంబర్లు జనవరి 1వ తేదీ నుంచి అమలులోకి వచ్చాయని మద్దికెర స్టేషన్ సూపరింటెండెంట్ పరమేశ్వరరెడ్డి సోమవారం తెలిపారు. అలాగే గుంతకల్లు – డోన్ రైలు బయలుదేరు వేళలో మార్పు చేశారని చెప్పారు. గతంలో ఉదయం 11.50కు వచ్చే ఈ రైలు ఇప్పుడు ఉదయం 11.18 గంటలకు మద్దికెర స్టేషన్‌కు వస్తుందన్నారు. ఈ మార్పును గమనించాలని సూచించారు.

రైలు	పాతనెంబర్	కొత్త నెంబర్
గుంతకల్లు– కాచిగూడ	07611	57411
గుంతకల్లు – డోన్	07288	77203
కర్నూలు టౌన్ – గుంతకల్లు	07292	77204
కాచిగూడ – గుంతకల్లు	07670	57412

పలు రైళ్ల రాక పోకలు ఆలస్యం

డోన్ రూరల్: కాచిగూడ నుంచి గుంతకల్‌కు వెళ్లే (57412) ప్యాసింజన్ రైలు ఈనెల 20, 27వ తేదీన 3.50 గంటలు , గుంతకల్ నుంచి బోధన్‌కు వెళ్లే (17253) ప్యాసింజర్ రైలు ఈనెల 20, 27వ తేదీన మూడు గంటలు ఆలస్యంగా ఆయా స్టేషన్లకు చేరుకుంటాయని రైల్వే అధికారులు సోమవారం తెలిపారు. అలాగే గుంటూరు నుంచి ఔరంగాబాద్ వెళ్లె (17253) ఎక్స్‌ప్రెస్ రైలు ఈనెల 8 నుంచి 29 తేదీ వరకు గంట ఆలస్యంగా చేరుకుంటుందన్నారు.

చేప పిల్లల అక్రమ తరలింపు

- బాధ్యులైన వారిని వదిలే ప్రసక్తే లేదు
- డీఎఫ్‌సీఎస్ చైర్మన్ నవీన్‌కుమార్

కర్నూలు(అగ్రికల్చర్): మత్స్యశాఖ కర్నూలు ఫామ్‌లో నాలుగు లక్షలకుపైగా చేప పిల్లల్ని పెంచుతుండగా కేసీ కెనాల్‌కు నీటి సరఫరా బంద్ కావడంతో అవి మరణిస్తున్నాయి. ఇక్కడ ఉన్న మూడు ఇంచుల చేప పిల్లలను శ్రీశైలం రిజర్వాయర్‌లో వదలాల్సి ఉన్నప్పటికీ సంబంధిత నియోజకవర్గం శాసనసభ్యులు షెడ్యూలు ఇవ్వకపోవడంతో ఆలస్యం జరుగుతోంది. అయితే ఆదివారం జిల్లా మత్స్యశాఖ అధికారికి సమాచారం లేకుండానే ఒక వాహనం ద్వారా చేప పిల్లలను సుంకేసులలోని మత్స్యశాఖ పామ్‌కు తరలిస్తామని చెప్పడం వివాదాస్పదం అయ్యింది. వెలుగోడుకు చెందిన వాహనం ఉపయోగించడంపై పలు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమాలకు బాధ్యులుగా మత్స్యశాఖ సహాయ ఇన్‌స్పెక్టర్ బాలరాజునే విమర్శలు వచ్చాయి.కాగా.. చేప పిల్లలను అక్రమంగా అమ్ముకుంటున్నారనే ఆరోపణలపై సమగ్రంగా విచారణ జరిపిస్తామని మత్స్యశాఖ డీడీ శ్యామల తెలిపారు. సోమవారం డీఎఫ్‌సీఎస్ కార్యాలయంలో డైరెక్టర్లతో నిర్వహించిన సమావేశంలో డీఎఫ్‌సీఎస్ చైర్మన్ నవీన్‌కుమార్ మాట్లాడుతూ.. కొంత మంది చేపపిల్లలను అక్రమంగా అమ్మకోవడం దారుణమని, ఇందుకు బాధ్యులైన వారిని వదిలే ప్రసక్తే లేదన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ పెద్ద వీరేష్, డైరెక్టర్లు పోతుల శేఖర్, మద్దిలేటి, మల్లీశ్వరుడు, మత్స్యకార సంఘం నేతలు నాగేషులు, భాస్కర్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎఫ్‌సీఎస్ చైర్మన్ నవీన్‌కుమార్

విధుల్లోకి తీసుకోకుండా.. వేదన మిగిల్చి!

- మహిళా అధ్యాపకురాలికి పోస్టింగ్ ఇవ్వని వైనం

కర్నూలు సిటీ: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విద్యా వ్యవస్థలో సమూల మార్పులు అంటూ తీసుకుంటున్న నిర్ణయాలు వివాదాస్పదంగా మారుతున్నాయి. అన్ని వర్సిటీల్లో ఒక నిబంధన ఉంటే క్లస్టర్ వర్సిటీ వేరు అన్నట్లు అధికారులు ప్రవర్తిస్తున్నారు. కర్నూలులోని కేవీఆర్ మహిళా డిగ్రీ కాలేజీలో పనిచేస్తున్న బయోకెమిస్ట్రీ లెక్చరర్ డాక్టర్ బి. ధనశ్రీని గతేడాది ఆగస్టులో గుంతకల్లులోని ఎస్‌కేపీ డిగ్రీ కాలేజీకి బదిలీ చేశారు. అక్కడ ఫస్ట్, సెకండ్ ఇయర్‌లో జీరో అడ్మిషన్స్ ఉండగా.. ఫైనల్ ఇయర్‌లోని అరుగురు వెళ్లిపోవడంతో వర్క్‌లోడ్ లేదని ఆ లెక్చరర్ కాలేజీయేట్ కమిషనర్‌కు తెలియజేశారు. గతేడాది సెప్టెంబరులో నంద్యాల డిగ్రీ కాలేజీకి బదిలీ చేయగా.. అక్కడ బయో కెమిస్ట్రీ కోర్సే లేదు. ఈ సమాచారాన్ని సైతం కాలేజీయేట్ కమిషనర్ తెలియజేయడంతో గత డిసెంబరు నెల చివరిలో డిగ్రీ కాలేజీల ఆర్జేడీ ఈమెను క్లస్టర్ యూనివర్సిటీకి డిప్యూటేషన్‌పై బదిలీ చేశారు. డిసెంబర్ 31న విధుల్లో చేరేందుకు ఆమె వెళ్లగా క్లస్టర్ యూనివర్సిటీ అధికారులు విధుల్లోకి తీసుకోవద్దని చెప్పారని ఆ కాలేజీ ప్రిన్సిపాల్ విధుల్లోకి చేర్చుకోలేదు. ఈ విషయంపై కేవీఆర్ డిగ్రీ కాలేజీ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీఎస్ కుమార్ మాట్లాడుతూ.. ఆమె జాయినింగ్ రిపోర్ట్ తీసుకోవద్దండని ముందుగానే చెప్పారన్నారు. రెగ్యులర్ డిగ్రీ కాలేజీ లెక్చరర్‌ను డిప్యూటేషన్‌పై ఆర్జేడీ నియమించకూడదని, కమిషనర్ మాత్రమే ఉత్తర్వులు ఇవ్వాలన్నారు.

నేటి నుంచి గ్రామీణ పాలనపై శిక్షణ

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఎంపీడీఓ, ఈఓఆర్‌డీ, డీఎల్‌పీఓలకు మండలాలు, గ్రామ పంచాయతీల్లో సాధారణ పరిపాలన, పంచాయతీరాజ్ చట్టం 1994 ముఖ్య నిబంధనలు తదితర అంశాలపై ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు డీపీఆర్‌సీ ప్రిన్సిపాల్, జెడ్పీ సీఈఓ జీ నాసరరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్, డీపీఓ జీ భాస్కర్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పంచాయతీరాజ్ శాఖ ఆదేశాల మేరకు రాష్ట్ర పీఆర్ అండ్ ఆర్‌డీ శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ప్రాంగణంలోని డీపీఆర్‌సీ భవనంలో శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు సోమవారం వారు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్యం, వ్యర్థాల నిర్వహణ, తాగునీటి సరఫరా, లేఅవుట్ అండ్ బిల్డింగ్ ప్లాన్ నిబంధనలు, గ్రామ పంచాయతీ ఆస్తులు, వీధి దీపాలు, విద్యుత్ బిల్లుల నిర్వహణ, ఆర్థిక నిర్వహణ, న్యాయ పరమైన అంశాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు తదితరాలపై శిక్షణ కొనసాగుతుందన్నారు. శ్రీకాళహస్తిలోని ఈటీసీలో శిక్షణ పొందిన మాస్టర్ ఆఫ్ ట్రైనర్స్ జిల్లా స్థాయిలో టీఓటీలకు శిక్షణ ఇస్తారన్నారు.

మసీదులను వక్ఫ్‌బోర్డులో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

కర్నూలు(అర్బన్): జిల్లాలో గౌరవ వేతనం పొందుతున్న ఇమామ్, మౌజాన్‌లకు సంబంధించిన మసీదులను వక్ఫ్ బోర్డులో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారిణి సయ్యద్ సబీహా పర్వీన్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. మసీదు రిజిస్ట్రేషన్ కోసం అవసరమైన పత్రాలను 15 రోజుల్లోగా స్థానిక మౌర్యా ఇన్ హోటల్ ఎదురుగా ఉన్న జిల్లా వక్ఫ్ బోర్డు కార్యాలయంలో అందజేయాలన్నారు. నిర్ణీత సమయంలోగా పత్రాలను అందించకపోతే మసీదు ఇమామ్, మౌజన్‌లకు గౌరవ వేతనం చెల్లింపు నిలిపివేయడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్: 9700866859లో సంప్రదించాలన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం


మార్కెటింగ్ స్టాల్ ప్రారంభిస్తున్న ప్రకృతి వ్యవసాయ శాఖ అడిషనల్ డీపీఎం లక్ష్మయ్య

వెల్దుర్తి: ప్రకృతి వ్యసాయ పద్ధతుల్లో పండించే దిగుబడులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ రైతు సాధికార సంస్థ కర్నూలు, నంద్యాల జిల్లాల అడిషనల్ డీపీఎం లక్ష్మయ్య తెలిపారు. సోమవారం స్థానిక రైతు సేవా కేంద్రం ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన మార్కెటింగ్ స్టాల్‌ను సంస్థ పత్తికొండ అసోసియేట్ (హెచ్‌ఆర్) భుజేశ్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం మండలంలోని సిబ్బందితో సమావేశమయ్యారు. సూదేపల్లె, రామళ్లకోట, బుక్కాపురం యూనిట్లుగా 17 గ్రామ సంఘాలతో చాలా మంది రైతులు ప్రకృతి వ్యవసాయంతో కూరగాయల సాగు చేయడం సంతోషకరమన్నారు. వెల్దుర్తిలోని స్టాల్‌లో ప్రతి సోమవారం వారి దిగుబడులు అమ్ముకునేలా ఏర్పాటు చేశామన్నారు. పత్తికొండ డివిజన్ మాస్టర్ ట్రైనర్ సుధాకర్ పాల్గొన్నారు.

బీసీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి పథకాలు

- 8 నుంచి 16వ వరకు అర్హుల నుంచి దరఖాస్తుల స్వీకరణ

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ద్వారా బీసీలు, ఈబీసీలకు స్వయం ఉపాధి పథకాలను ప్రవేశపెట్టినట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. బీసీలకు 1,673 యూనిట్లు, ఈబీసీలకు 171 యూనిట్లు మంజూరైనట్లు చెప్పారు. సోమవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో బీసీ కార్పొరేషన్ పథకాలపై చర్చించేందుకు స్పెషల్ డిస్ట్రిక్ట్ కన్సల్టేటివ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. బీసీ కార్పొరేషన్ ద్వారా ఏర్పాటయ్యే యూనిట్లకు 50 శాతం సబ్సిడీ ఉంటుందని, అర్హులైన వారు జనవరి 8 నుంచి 16వ తేదీవరకు ఓబీఎంఎంఎస్ ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ క్రమంలో ఆయా యూనిట్లకు బ్యాంకుల వారీగా లక్ష్యాలను నిర్దేశించినట్లు చెప్పారు. దరఖాస్తులు తిరస్కరణకు గురికాకుండా ముందుగానే క్షేత్రస్థాయిలో అభ్యర్థులకు అవగాహన కల్పించాలనిసూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కల్యాణి, ఎల్‌డీఎం రామచంద్రరావు, బీసీ కార్పొరేషన్ ఈడీ జాకీర్ హుస్సేన్ బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

పెట్రోలుతో ఆడుకుంటుండగా నిప్పంటుకుని బాలుడికి తీవ్ర గాయాలు

ఆస్పరి: ఇద్దరు చిన్నారులు పెట్రోలుతో ఆడుకుంటుండగా నిప్పంటుకుని ఓ బాలుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఆస్పరి మండలం బిల్లేకల్లులో జరిగిన ఈ ప్రమాదం ఆలస్యంగా వెలుగులోకొచ్చింది. ఈ నెల 3న స్థానిక ప్రాథమిక పాఠశాలలో మూడో తరగతి చదువుతున్న అరవింద్, వికాష్‌లు ఆడుకునేందుకు వెళ్లారు. గ్రామంలో బస్టాప్ దగ్గర నిలిపి ఉన్న స్కూటర్‌కు ఉన్న పైపును ఊడదీసి చెరో చిన్న ప్లాస్టిక్ బాటిళ్లలో పెట్రోలు నింపుకొన్నారు. అనంతరం వికాష్.. అరవింద్ ఒంటిపై పెట్రోల్ జల్లి నిప్పంటించాడు. దీంతో అరవింద్ ఒంటినిండా ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. దీంతో వికాష్ అక్కడి నుంచి పరుగులు పెట్టాడు. గ్రామస్తులు మంటలార్పేలోగా అరవింద్ తీవ్రంగా గాయపడ్డాడు. బాలుడిని ఆస్పరి ప్రాథమిక ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం ఆదోని ప్రభుత్వాస్పత్రికి.. అక్కడి నుంచి కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు.

తల్లీ బిడ్డ అదృశ్యం

కొత్తపల్లి: మండలకేంద్రం కొత్తపల్లికి చెందిన తల్లీ బిడ్డ అదృశ్యమయ్యారు. ఎస్ఐ ఎం.కేశవ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మానిపాటి నాగేశ్వరరావుకు 3 ఏళ్ల క్రితం మానిపాటి అనూషతో వివాహమైంది. వీరికి రెండేళ్లు, ఆరునెలల వయస్సు గల ఇద్దరు కుమారులున్నారు. ఆదివారం మధ్యాహ్నం భర్త నాగేశ్వరరావు పశువుల దొడ్డి దగ్గరికి పనిపై వెళ్లాడు. తిరిగి వచ్చేలోపు భార్య అనూష, చిన్న కుమారుడు సూర్యవర్ధన్ కనిపించకుండాపోయారు. చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో గాలించగా ఎక్కడా ఆచూకీ లభించలేదు. దీంతో నాగేశ్వరావు సోమవారం పోలీసులను ఆశ్రయించాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు. ఆచూకీ తెలిసిన వారు 9121101185, 9121101181 నంబర్లకు తెలియజేయాలని ఆయన కోరారు.



తప్పిపోయిన తల్లి మానిపాటి అనూష, కొడుకు సూర్యవర్ధన్

విధిని ఓడించి..

ఆ కుటుంబానికి ఒక్కగానొక్క కుమారుడైన అతనిని విధి వెక్కిరించింది. మూడేళ్ల వయస్సులో పోలియో రూపంలో రెండు కాళ్లు పనిచేయడం మానేశాయి. తనకు వైకల్యం వచ్చిందని అతను భయపడలేదు. అంకితభావం, మొండి ధైర్యంతో జీవితాన్ని నెట్టుకొస్తున్నాడు. ఆత్మకూరు మండలం నల్లకాలువ గ్రామానికి చెందిన వాల్మీకి నాగార్జున ప్రభు (43) కు చిన్నతనంలోనే పోలియో రావడంతో వైకల్యానికి వెరవకుండా చదువు సాగించాడు. స్టెనోగ్రాఫర్‌గా కూడా చదువు పూర్తి చేశాడు. చదివిన చదువుకు ఉద్యోగం రాకపోవడంతో ఏమాత్రం అధైర్యపడలేదు. మూడు చక్రాల మోటర్‌బైక్‌పై 2008 నుంచి ఊరూరూ తిరుగుతూ మొబైల్ ఫోన్లకు సిమ్ కార్డులు విక్రయించేవాడు. ఇటీవల అనారోగ్యం కారణంగా ఊర్లు తిరగడం మానేశాడు. కర్నూలులోని నంద్యాల చెక్‌పోస్టు ప్రాంతంలో తల్లిదండ్రులతో కలసి నివాసముంటూ వైద్యం చేయించుకుంటున్నాడు. మరోవైపు జీవన భృతి కోసం తన మూడు చక్రాల మోటర్‌బైక్‌పై రెడ్‌క్రాస్ రక్త నిధి వద్ద స్టాండ్ ఏర్పాటు చేసుకుని సిమ్ కార్డులు విక్రయిస్తున్నాడు. అన్ని కంపెనీల నూతన సిమ్ కార్డులు విక్రయించడంతో పాటు ఎంఎన్‌పీలు కూడా చేస్తూ జీవనం సాగిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడు.


మూడు చక్రాల మోటార్ సైకిల్‌పై సిమ్ కార్డులు విక్రయిస్తున్న వాల్మీకి నాగార్జున ప్రభు

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు